# ఇప్పటి కుర్రాళ్ళు

"ఏవండీ! ...పోస్టుమాన్ వచ్చివెళ్ళాడా?... అబ్బాయి దగ్గర్నుంచి ఇంకా జవాబురాలేదూ?...అయినా..." అంటూ అర్ధోక్తిలోనే ఆగిపోయింది అప్పుడే పెరట్లో పసుపు కొట్టించడం పూర్తిచేసి హాల్లోకి అడుగు పెడుతూన్న సుందరమ్మ. వాలుకుర్చీలో పడుకొని తలపైకెత్తి, చూర్లో గూడు బయటకి ముక్కులు చాసిన పిల్లలకి మేత అందిస్తూన్న తల్లి పిచిక కేసి సాలోచనగా చూస్తూ నిశ్శబ్ద గంభీరంగా ఉన్న గురునాథాన్ని చూసి–అవును–మాట మధ్యలోనే ఆగిపోయింది సుందరమ్మ - అలా ఆగిపోవడానికి కారణం లేకపోలేదు.

నిశ్శబ్దంగా కూర్చుని గంభీరంగా ఆలోచిస్తున్న భర్తని చూసినప్పుడల్లా సుందరమ్మ గుండె గతుక్కుమంటుంది. ఏమంటే, సాధారణంగా గురునాథం మాట్లాడకుండా ఒకమూల కూచునే మనిషి కాదు. స్నేహితులతోనో, భార్యతోనో ఎవరూ లేకపోతే ఆఖరికి పక్కింటి పాపాయిలతోనో

హుషారుగా కబుర్లు చెబుతూ తను నవ్వుతూ ఇతరుల్ని నవ్విస్తూ అస్తమానూ సరదాగా కాలక్షేపం చేసేమనిషి, ముభావంగా ఒక్క క్షణం కూర్చునే తరహాకాదు. ఏటి కాలాని కొకసారి ఎప్పుడైనా ఆ విధంగా కూర్చున్నా డంటే, అందుకు ఏదో విశేషం ఉండేవుంటుంది... అందు లోనూ ఆయన మనస్సునేదో బాధిస్తూన్న విషయముండుంటేనే కాని ఆయన మౌనంగా కూర్చోరు.

వెనకటి కోమారు తను కాపురానికొచ్చిన కొత్తలో ఓ రోజున ఇలాగే కూచున్నారు. ఆయన ఆప్తమిత్రుడొకడు రైలు యాక్సిడెంటులో కాలు విరగ్గొట్టుకున్నాడనే వార్త విన్నప్పుడు.

ఆ తర్వాత మళ్ళీ అబ్బాయి ఎడపిల్లాడూ, అమ్మాయి చంటి పిల్లగా ఉన్నప్పుడు, తను ఏదో అన్నానని కోపం వచ్చి, అక్కడేవూళ్ళోనో ఆయన చెల్లెలి పెళ్ళి జరుగు తూంటే, వెళ్ళకుండా ఇక్కడ కుర్చీలో కళ్ళనీళ్ళు పెట్టు కుంటూ విషాదంగా కూర్చున్నారు.

మళ్ళీ ఉద్యోగంలో రివర్షను వచ్చినప్పుడు, అప్పుడూ ఇంతే-

ఇలా ఏదో మనస్సు బాధపడితేగాని ఇంత స్థిమి తంగా కూర్చోరు ఆయన. అందువల్ల ఇటువంటి సమయాల్లో పలకరించి రకరకాల ప్రశ్నలతో వేధించి ఆయన మన స్థిమి తాన్ని మరింత చెడగొట్టడం తనకి యిష్టముండదు. ఒక

నిముషం పలకరించకుండా ఊరుకుంటే సరి, మళ్ళీ ఆయనే సర్దుకుని మామూలు మనిషి అవుతారు.

ఇలా ఆలోచించింది కనకే, అంటూ అంటూన్న మాటనికూడా మధ్యలో తుంచేసింది సుందరమ్మ. తుంచేసి దీర్ఘంగా నిట్టూర్చి తిరిగి వంటింట్లోకి వచ్చేసింది. పప్పు వేయించి కందిపొడుం విసరడంకోసం. ఇంకా అప్పడాలు పెట్టాలి, అరిసెలపిండి కొట్టాలి. అన్ని సరుకులు బజారు నుంచి తెప్పించుకుని సర్దుకోవాలి. మధుపర్కాలు కొనాలి. మంచి సూట్లు అల్లుడికి కుట్టించాలి. మంగళసూత్రం చేయించాలి, వెండి కంచం, వెండిచెంబూ పురమాయించాలి- ఇలా ఎన్నని! ఆడపిల్ల పెళ్ళంటే మాటలా!... ఇవన్నీ ఒక్క చేతిమీద తనెలా చేస్తుంది? అందుకే పదిరోజులు ముందుగా కోడలిని పంపమని అబ్బాయికి రాస్తే ఇప్పటికి జాడాజవాబూ లేదు ... పోనీ నేను తర్వాత ఫలానా తేదీన వస్తున్నాను, ముందు కోడలిని ఫలానా రైలుకి పంపుతున్నాను అంటూ ఓ కార్డుముక్క రాయడానికే ... ఇక్కడ మా అవస్థలేం అర్థంకాక తనని కానట్టు ఊరుకుంటే ఎలాగ? చెల్లెలి పెళ్ళి" అంటే తనకి బాధ్యతలేదూ! తల్లిదండ్రులు గా మేం ఎంతో అన్నగారిగా తను అంతకాదూ! ఉత్తరానికి జవాబుకూడా రాయకుండా ఊరుకొన్న కొడుకు ప్రవర్తన చూస్తూంటే సుందరమ్మ మనస్సు మంగలంతో వేగినట్టు వేగిపోతోంది.

దౌర్భాగ్యుడు... దౌర్భాగ్యుడా అని ..ఇలా చెల్లెలు పెళ్ళి... నువ్వో అయిదారు వందలు సర్దవలసి ఉంటుందని ఆయన రాసిన ఉత్తరానికి జవాబుకూడా రాయలేదు చూడు... ఆయనంతటి పౌరుషం అయిన వ్యక్తి, ఎవర్నీ ఎప్పుడూ నోరు విప్పి అడగని మనిషి కన్నకొడుకు కదా అని చనువుగా రాస్తే తను ప్రవర్తించవలసిన విధానం ఇదా ?...

ఈఆలోచనలతో సుందరమ్మకి ఛట్టున స్ఫురించింది.. ఓహో! ...ఆయనలా నిశ్శబ్దంగానూ గంభీరంగానూ కూర్చున్నారంటే ఇంకా ఏవిటో అనుకున్నాను... ఇదా!... ఇందుకా ఆయన అలా ఆలోచిస్తూ కూర్చున్నారు? ... నోరు విడిచి ఆ అయిదారు వందలూ సర్దమని వాడిని ఎందుకడి గానూ!... అడక్కుండా ఉండినా బాగుండిపోనే అని బాధ పడుతూ ఉండివుంటారు... పాపం...

నిజమే !...

దీనికంతకీ కారణం... పాపం ఆయన వద్దంటూనే ఉన్నారు... "కుర్రమొహం, వాడేంసర్దుతాడు పోనిదూ... మనమే ఏ తలో తాకట్టు పెట్టి ఈ కాస్త శుభం అయిం దనిపిద్దాం... అవసరం అయితే ఈ ఇల్లు తనఖా అయినా పెట్టి డబ్బుతీసుకొస్తాను కాని వాడిని ఇబ్బంది పెట్టడం ఎందుకే!... కోడలూ వాడూ ఆ మహాపట్నంలో సరదాగా ఉండడానికే సరిపోదు వాడి కొచ్చేజీతం... పోనిద్దూ..." అంటూ—

కాని తనే అందుకు అంగీకరించ లేదు..."కుర్ర మొహం ఏవిటి!.... రాయండి... అయిదారు వందలు పంపమని రాయండి" అంది-పెద్ద బలవంతం మీద మొత్తానికి ఏమైతేనేం రాశారు. కాని రాసిన మర్నాటినుంచీ "ఏవిటో వాడికి ఉత్తరం రాసేదాకా ఒక్కలా పోరుపెటావు..కుర్రనాగమ్మ.. నా ఉత్తరం రాసినప్పటినుంచీ ఏం తంటాలు పడుతున్నాడో ఏమిటో" అంటూ ఏక ఇదవసాగారు. "ఉండండి వాడిదగ్గర నుంచి జవాబురాకుండా మీరు కంగారుపడతారు దేనికి!" అంటూ వచ్చింది తను.

"జవాబు! హుఁ! నీ చాదస్తంగాని ఏం రాస్తాడు... డబ్బు పంపగలను. త్వరలో ముహూర్తం పెట్టించండి అని రాయాలని మన ఆశ, అవునా!...కాని అంతడబ్బు వాడు ఎక్కడనుంచి తెస్తాడు ఒక్కమాటు?" ఇదీ ఆయన బెంగ.

"ఒక్కమాటు కష్టంకనకే; ప్రతినెలా ఇంటికి పదో పరకో పంపరా... రేపు చెల్లాయి పెళ్ళికి ఉపయోగపడుతుంది ఉన్నదంతా నీ చదువుకే ఊడ్చి పెట్టెయ్యడంవల్ల ఆయన దగ్గరేం మిగలలేదు...పెళ్ళంటే మాటలా! ఒక్కచేతిమీద సద్దుకోవడం ఎంతకష్టం!" అంటూ చిలక్కి చెప్పినట్లు చెప్పాను మొన్నవాడు వచ్చినప్పుడు. అలాగే అంటూ తలాడించాడు...కాని ఏదీ-ఒక్కనెల పంపించాడా!.... అయినా వాణ్ణని ఏం లాభంలెండి!. .వాడికి పంపించాలనే ఉంటుంది. కాని ఆ మహాతల్లి పడనీయవద్దూ! అప్పటికప్పుడు రాణీ కట్నం ఇయ్యక్కర్లేకుండా బంగారంలాంటి పిల్లాణ్ని వల్లో

వేసుకుంది.. ఇదిగో ఇప్పుడు వాణ్ణి చవట దద్దమ్మనిచేసి, ఇంటికి నయాపైస పంపించకుండా తయారుచేస్తోంది. దారి కింది మహాతల్లి!"

ఇంకా తనేదో చెప్పబోతూంటే ఆయన ఊకొడితేనా! దాని వంటిమీద ఈగ వాలనియ్యకుండా అడ్డుకొని "ఊరికే కోడలిపిల్లనెందుకే ఆడిపోసుకుంటావు! కట్నం లేకపోతేనేం! బంగారపు బొమ్మ.. అబ్బాయి పక్కనది నడుస్తూంటే ఎంత ముచ్చటగా ఉంటుందే చూడ్డానికి!.. .ఆ నెమ్మది! ఆ వినయం?. ఆ లక్షణాలన్నీ ఆవిద్యతోటే వస్తాయేమో అసలు! నీ మట్టుకి నీకెంత గౌరవం చేస్తుందే అత్తయ్యగారూ అత్తయ్యగారంటూ. .ఏవిటో నీ వెర్రిగాని పది పదిహేను వేలు కట్నం పట్టుకొచ్చినపిల్ల గర్వంతో విఱ్ఱవీగుతూ వుంటుందే కాని ఇలా నమ్రతగానూ, విధేయతగానూ ఉంటుందిటే..." ఇలా ఆయన దాన్ని తెగ పొగుడుతూంటే తనకి మహాచిరాకేసింది...మరి వెయ్యదూ! అందుకే అంది. ."చాల్లెండి మీ పొగడడం!. .దానికి వినయం, విధేయతా, మనం అంటే ప్రేమా అభిమానం—ఇవన్నీ ఉంటే అబ్బాయిచేత ఉత్తరమే రాయిుచును"—అని—

"అది రాయించడం ఏవిటే?...వాణ్ని రాయొద్దని అదేవైనా ఆపుచేసిందేవిటీ?"

"అయ్యోరాత!...మీకేంతెలుసు! ..ఆడది తల్చుకుంటే...ఇష్టంలేని వాడిచేత ఒప్పించాగలదు. ఇష్టఁఉన్న వాడిచేత మానిపించాగలదు."

తను అన్న ఆమాటలకి తనకేసి ఆయన అదోలా చూసి ఏకో పాతసంగతి జ్ఞప్తికి వచ్చినట్లు మొహంపెట్టి వెటకారంగా "ఆహా!.... అలాగా ! .... అవునవును ... జ్ఞాపకం వచ్చింది...అలాగే! నువ్వుఅన్నది నిజమే సుమా!" అన్నారు. తనకి ఆయన వెటకారంచూస్తే చిరాకేసింది.

"ఎప్పటిదో మన సంగతి ఎందుకు ఇప్పుడు ! అప్పుడు మీరు మీ చెల్లెలి పెళ్ళికి సాయంచెయ్యకపోవడానికి పోలిక లేదు. మీ నాన్నగారికి మీరు కాకపోతే మరోకొడుకూ, మరోకొడుకూ సాయం చెయ్యడానికి ఉన్నారు. మనకెంత మంది ఉన్నారు ? వీడొక్కడేగా ! పైగా మీచెల్లెలికి మీరు ఏం పంపించలేకపోవడానికి మనం అప్పుడు ఎంత ఖర్చులోఉన్నామో తెలుసా?...అయినా మీతో వాదిస్తూ కూచోడానికి నా కెక్కడ ఖాళీ ?...అవతల చెయ్యవలసినవీ చేయించవలసినవీ పనులు బోలెడున్నాయి...అవన్నీ ఒక్క చేతిమీద చేసుకోవాలి...డబ్బు పంపకపోతే మానె, మనుష్యులయినావచ్చి చేతికి ఆసరా అయితే బాగుణ్ణు...ఉత్తరం వస్తే కేకెయ్యండి..."

ఇలా ఈ రెండుమూడు రోజులనుంచీ ఇంట్లో జరుగుతూన్న సంభాషణలని జ్ఞప్తికి తెచ్చుకుంటూ, పప్పు వేయించడం పూర్తిచేసి, తిరగలి తేవడంకోసం తిరిగి పెరట్లోకి

వెళుతూంటే హాల్లోంచి గురునాథం వేసిన కేక వినిపించింది సుందరమ్మకి.

"ఏం!... ఉండండి... వస్తున్నా... చేతిలో పనుంది- అమ్మాయి వచ్చిందా స్కూలునుంచి?... ఏవిటో!... తెల్లారితే పెళ్ళికూతుర్ని చెయ్యాలి, శలవు పెట్టకుండా ఇంకా స్కూలికి వెళ్ళడం ఏవిటో! ఇంట్లో చెబితే ఒక్కళ్ళు వినిపించుకోరుకదా! అబ్బబ్బ! ఏవిటా కేకలు వస్తున్నానంటూంటే! ... రాని అబ్బాయిమీద కోడలిమీదా రాదుకాని, ఒక్క క్షణం ఊపిరి తీసుకోడానికి లేకుండా ఏక పనితో పొట్టపొట్టు అవుతూన్న నామీద వస్తుంది కోపం... లేకపోతే ఏవిటా కేకలు ఒక్కవరసని!"

అంటూ హాల్లోకి ప్రవేశించిన సుందరమ్మ హాల్లో కవాచీ బల్లమీద కనిపించిన పెట్టే బెడ్డింగూ చూసి తెల్లబోయింది... 'ఇవెక్కడివండీ!' అని అడిగేలోపుగానే మెట్లు ఎక్కుతూన్న కోడలూ, కూలివాడికి డబ్బిచ్చి పంపిస్తూన్న కొడుకూ కనిపించారు.

వాళ్ళని చూసేసరికి సుందరమ్మ మొహం అంత అయింది... "అమ్మయ్యా వచ్చారా?... ఇంకా రాలేదు ఏవిటి వీళ్ళు, పెళ్ళికి రారేవిటి చెప్మా అంటూ తెగ ఆందోళన పడుతున్నా" అంది.

ప్రసాద్ వెంటనే "అదేవిటమ్మా! ఎందుకు రాము!... చెల్లెలు పెళ్ళికి రాకుండా మానేసేవాడెవడైనా వుంటాడా," అన్నాడు.

"ఉండకేం! ... నిక్షేపంలా ... భార్యనోటికి జడిసి చెల్లెలి పెళ్ళికి డబ్బుసర్దక అలా సర్దలేకపోయామే అనే సిగ్గుతో అసలు చెల్లెలి పెళ్ళికే వెళ్ళకుండా మానేసిన వారున్నారు లోకంలో-ఏవంటావే సుందరీ!" అంటూ చురుగ్గా చూశాడు సుందరమ్మకేసి గురునాథం-

ఆ చూపులోని వ్యంగ్యం గుండెలకు తగిలి, కోపంతో "చాల్లెండి - అంత ప్రయాణం చేసివచ్చిన పిల్లల్ని హాల్లో నించోబెట్టి కబుర్లు మీరూను .. వెళ్ళండర్రా .. లోపలికి వెళ్ళి స్నానంగట్రా చెయ్యండి — ఈలోగా అన్నంవడ్డిస్తాను పొద్దున్న ఎప్పుడు తిన్నారో ఏమిటో!" అంటూ అడుగు కదిపింది సుందరమ్మ.

అమ్మాయిని పెళ్ళికూతుర్ని చేశారు. ఇంట్లో పెళ్ళి పనులు జోరుగా సాగుతున్నాయి. ఓపక్కనుంచి ఆడబడుచుని వేళాకోళంచేస్తూ కవ్విస్తూ నవ్విస్తూ, మరోపక్కని తనకి చెయ్యి ఆసరాగా, చేతిలో పని అందుకుంటూ నడ్డి వంచి, నిముషం కాళీగా కూచోకుండా గిర్రున చక్రంలా తిరుగుతూ అన్ని పనులూ చక్కబెడుతూన్న శారదని, తండ్రిని కుర్చీలోంచి కదలనీయకుండా బజారు సరుకులు తేవడం దగ్గర్నుంచి పందిళ్ళు పాకలూ వేయించడందాకా అన్నీ తనే అతి చాకచక్యంగా చూస్తూ ఒక్క క్షణం కూర్చోకుండా శ్రమపడుతూన్న ప్రసాద్‌నీ చూసేసరికి సుందరమ్మకళ్లు గర్వంతో మెరిశాయి. నాకేకదా అటువంటి కోడలూ కొడుకూ ఉన్నారనే సంతృప్తితో.

అయితే, అబ్బాయి అనుకున్న ప్రకారం ఆ అయిదారు వందలూ తెచ్చి ఆయనకి సాయం చేశాడా!

కోడలికిఉండే ఆ రెండో గాజులజతా. మెళ్ళో మిలమిలా మెరిసే ఆ మూడు పేటల గొలుసూ ఏవయినట్టు? వేసుకోదేం?....

ఈ రెండు ప్రశ్నలకీమాత్రం సమాధానందొరక్క సుందరమ్మ మహా ఆందోళన పడుతోంది.... పోనీ వాళ్ళనే అడుగుదాం అంటే పనివాళ్ళతో, పేరంటాళ్ళతో, ఒక్కొక్కరే దిగుతూన్న చుట్టాలతో, ఇల్లంతా తెగ నిండిపోయి ఏకాంతమే దొరకడంలేదు. ఎప్పుడేప్రశ్న అడుగుదాం అన్నా ఎవరో ఒక పైవ్యక్తి ఉంటూనే ఉన్నారు.

బాజాలు, మంత్రాలు, తలంబ్రాలు; అలకపాన్పులు, విందులు, పెళ్ళివారు, చుట్టాలూ, నవ్వులు, కేకలు, కేరింతాలతో ఝామ్మంటూ జరిగింది పెళ్ళి. ఆ తర్వాత చుట్టాలికీ పెళ్ళివారికీ ఘనంగా బట్టలూ పసుపూ కుంకం పంపిస్తూ అందరూ "బాగుంది పెద్ద అంతస్థులోనే పెట్టింది అని పొగిడేలా కూతురికి చీరా సారె పెట్టి అత్తింటికి పంపుతూ, ఆ గర్వంతోనే ఇటు కోడలికేసి తిరిగి అంది సుందరమ్మ: "ఆడపిల్లకి ఇలా ఉన్నదాంట్లో తృణమో ఫణమో పెట్టి అత్తవారింటికి పంపడం అచ్చటాముచ్చటాను. అంతే కాని మరీ కొబ్బరిబోండాన్ని పిల్లని ఇవ్వడం మాచెడ్డ నామోషీ సుమా పౌరుషవంతులకి.. .అయినా చీరా సారె ఏం పెట్ట

కుండా అత్తారింటికి పిల్లని పంపడం మా ఇంటావంటా లేదు" అని.

ఆ మాటలు తనని ఉద్దేశించి అన్నవె అని గ్రహించీ కూడా శారద ఏం జవాబు చెప్పలేదు. కాలి బొటనవేలితో గచ్చుమీద రాస్తూ, కొంగు చివరవేలికి చుట్టుకుంటూ తలవంచుకు నిలబడింది.

వంట బ్రాహ్మలకీ చాకళ్ళకీ ఇవ్వవలసినడబ్బు ఇచ్చేసి మిగిలిన చిల్లర గురునాధానికి ఇవ్వడానికి వెళు తూన్న ప్రసాద్ చెవిని, సుందరమ్మ అన్న మాటలూ పడ్డాయి. అతనికి శారద మౌనంగా నిలబడి ఉన్న దృశ్యమూ కంటబడింది. అందుకే అక్కడికి వచ్చి "ఏవిటమ్మా అంటు న్నావు!... చీరలూసారెలూనా? వాటి విలువ ఎంతమ్మా! ... లక్షలకి లక్షలు విలువచేసే మన లక్ష్మికంటే ఎక్కువా! ... మనచెల్లాయి విలువ తెలియక, దాని అత్తారు చీరలూ, సారెలూమీద మోజుపడ్డారు. కాని శారద అత్తారు అలా కాదు దాని విలువ తెలుసుకనుక చీరలూ సారెలూ తీసుకో లేదు ఏమిటో! ఈ పాతకాలపు సంగతులు పోనిద్దూ - చీర లేవిటి సారెలేవిటి, బంగారంలాంటి మనుష్యులు కావాలి. నీకు అలాగే అమిరారు ..సాక్షాత్తూ లక్ష్మిలాంటి కూతురూ, సరస్వతిలాంటి కోడలూను ఏమంటావు" అంటూ నవ్వాడు.

"ఆ... నా అదృష్టమే చెప్పాలి! అవును అన్నట్టు బంగారం అంటే జ్ఞాపకం వచ్చింది ఏమే శారదా, నీ మెళ్ళో

గొలుసూ, ఆ రెండో జత గాజులూ ఏవయ్యాయి! పెళ్ళి కొచ్చినప్పటినుంచి చూస్తున్నాను" అంది సుందరమ్మ.

ఆమాటకి తలయెత్తి చూసిందేకాని సమాధానం ఏం చెప్పలేదు శారద. ఈమాటు ప్రసాద్‌కూడా తల వంచేశాడు.

"ఏం!... జవాబు చెప్పవేం!.. మా పుట్టింటివాళ్లు పెట్టినవేగదా, వాటి గురించి ఈవిడెందుకు అడగడం అనా! ఆడబడుచు పెళ్ళి అయిరి, ఎందుకు పెట్టుకోలేదూ అంట!"

శారదా ప్రసాద్‌లు ఒకరి మొహాలొకరు చూసుకొని ఊరుకున్నారు. సమాధానం ఈమారూ ఏం చెప్పలేదు.

"చెప్పడానికి ఇష్టంలేకపోతే చెప్పను అని అను.... పోనీ నువ్వేనా చెప్పరా, కోడలి గొలుసూ గాజులజతా ఏమయ్యాయో!" అంటూ నిలదీసింది సుందరమ్మ.

ఇంతలో హాల్లోంచి గురునాథం "వాళ్ళిద్దర్నీ అలా నిలదీసి అడిగేస్తే ఏం సమాధానం చెప్తారే!... నీకు కోడలి గొలుసూ గాజులజతేగా కావలసింది! .. ఇవిగో" అంటూ అక్కడికి ప్రవేశించాడు.

మావగారి చేతిలో ఆ వస్తువులుచూసి తెల్లబోయింది శారద. అంతకంటే ఎక్కువ తెల్లబోయాడు ప్రసాద్ ప్రశ్నార్థకంగా ఒకళ్లనొకళ్ళు చూసుకున్నారు. ఆ వస్తువులు ఆయనదగ్గరెందుకున్నాయో సుందరమ్మకి అర్థంకాలేదు. ..

వాళ్ల ముగ్గురికంగారూ చూసి నవ్వుకుంటూ "అమ్మా శారద, ముందీగొలుసు వేసుకొని, చేతికి గాజులుతొడుక్కొని, హాల్లో నా చిన్ననాటి స్నేహితుడు కుప్పుస్వామి కూర్చొని ఉన్నాడు, అతనికి కొంచెం కాఫీ టిఫెనూ పట్టికెళ్లి ఇయ్యమ్మా" అంటూ పురమాయించాడు.

శారద ఆ నగలు అందుకుంటూ వంటింట్లోకి తడబడుతూ నడిచింది... "కుప్పుస్వామి వచ్చాడా! ఎన్నాళ్లయిందో అతణ్ణిచూసి! అతనికి శుభలేఖ వెయ్యలేదామీరు, పెళ్ళయాక వచ్చాడేవిటి? ఏం కుప్పుస్వామీ! మీ అబ్బాయిలూ అమ్మాయిలూ కులాసాగాఉన్నారా!... అన్నట్టు మీకు పిల్లలెంతమంది!" అంటూ గబగబా వెళ్లిపోయింది హాల్లోకి సుందరమ్మ....

"కు... ప్పు... స్వా...మి ... కుప్పుస్వామి అంటే .!" అంటూ ప్రసాద్ జ్ఞాపకం తెచ్చుకోడానికి ప్రయత్నం చేస్తున్నాడు.

గురునాథం నవ్వుతూ "అదేరా పట్నంలో నువ్వు కోడలి గొలుసూ గాజులజతలూ ముందు తాకట్టు పెట్టబోయి ఆ తర్వాత కొట్లో అమ్మేశావు చూశావా, ఆ కొట్టు యజమానే!"

"నాన్నా" అన్నాడు ప్రసాద్ బేలగా

"వెర్రినాయనా?... చెల్లెలి పెళ్ళికి డబ్బు ఏమైనా ఉంటే సర్దరా అని నేనురాస్తే, భార్య వస్తువులు అమ్మ

నాకు డబ్బు సర్దుతావా?...నాదగ్గర డబ్బు లేదునాన్నా అని చనువుగా నాకు రాయకూడదుట్రా?...నువ్వు ఇలా ఎక్కడ బాధపడి సర్దుతానో అని భయపడే మొదట్లో నీకు రాయ నన్నాను. మీఅమ్మే రాసేదాకా చంపుకుతింది. నువ్వు మొదటి తాకట్టు పత్రాల్లో ఫలానా, వారి అబ్బాయిఅనీ అసలు ఊరు ఫలానా అని రాయగానే కుప్పుస్వామి ఓహో అని అది పసిగట్టి; నీకు డబ్బు ఏం అవసరంవచ్చిందో అర్థం కాక, కొంచెం ఎక్కువే ముట్టచెప్పడంకోసం తాకట్టుకాదని ఏకంగా అమ్మకానికే తీసుకొని ఇంకొంచెం ఎక్కువడబ్బు నీకిచ్చాడట. ఆ తర్వాత నా శుభలేఖ అంది వస్తూ ఈ గొలుసూ గాజులజతా పట్టుకొచ్చాడు పెళ్లిరోజుకి రావ డానికి పాపం అతనికి రైల్లో రిజర్వేషన్ దొరకలేదుట... ఈ వస్తువులు తీసుకుని నీకు అతను ఏడువందల ఏభై ఇచ్చా డట... నువ్వు నాకు వచ్చి ఇచ్చింది ఏడువందల యాభ య్యేగా...! దాంతో అర్థం అయింది నీకు డబ్బు ఎలా వచ్చిందో" అన్నాడు గురునాథం.

తప్పుచేసినవాడిలా చేతులు నలుపుకుంటూ "అది కాదునాన్నా" అంటూ ఏదో చెప్పబోయాడు ప్రసాద్.

కొడుకు తల ఆప్యాయంగా నిమురుతూ "నువ్వు నాకేం చెప్పక్కర్లేదురా. అంతా అర్థం అయింది చెల్లెలి పెళ్ళికి సాయం చెయ్యాలనేకోరిక ఎంత బలంగా ఉంటుందో నాకూ తెలుసు వెనకటికోమాటు నీ పరిస్థితిలాగే వచ్చింది నాడీను. మా చెల్లెలి పెళ్లికి కొద్దిగా సాయం చెయ్యమని

మానాన్న రాస్తే, ఎలాగేనా డబ్బు పంపించాలని నా ప్రాణం గిలగిల్లాడిపోయింది. పైగా అప్పటికి నాదగ్గర ఏడెనిమిది వందలు డబ్బుకూడా రెడీగా ఉంది. కాని మీ అమ్మ పంపనివ్వలేదు. ససేమిరా వీల్లేదంది. పెద్ద రగడ చేసింది. ఓ అలగడమూ, అన్నం మానెయ్యడమూ ఒకటేమిటి, ఒట్లూ సత్యాగ్రహాలూ, ఆ ఫిక్స్డ్ డిపాజిట్లులోకి పంపారంటేనా!" అంటూ బెదిరింపులూ హుంకరింపులూను తల్చుకుంటే ఇప్పుడు భయంగా ఉంది అప్పుడు అదిచేసిన హడావిడి అక్కడికీ అని చూశాను. "ఆ డబ్బు నేను సంపాదించిందే-నీ యిష్టం ఏమిటే!" అని. కాని వినిపించుకుంటేనా! అగ్గి మీద గుగ్గిలంలా లేచి, "మీ సంపాదన యెంత అసలు! నేను కలె తిన్నానో గంజే తాగానో ఏం తెలుసు? పిల్లలు ఎదుగుతున్నారని జాగ్రత్తచేసి వెనక వేశాను. కనకే ఇవాళ ఆ డబ్బు మీ కంటికి కనిపిస్తోంది-ఇంతచేసినా మాపుట్టింటి వారు మీ కిచ్చిన కట్నంపాటి అయినా దాచలేదు పైగా ఈ డబ్బు దాచడం అంతా మీ ప్రజ్ఞకిందే చెప్తారేమిటి! ఆడది తల్చుకుంటే మీరు డబ్బు దాచగలరా! దాచ మనండి చూద్దాం మీ యిద్దరి తమ్ముళ్ళనీను. వీల్లేదు... ఈ డబ్బు మీ చెల్లెలి పెళ్ళికి పంపడానికి వీల్లేదు... అవసరం అయితే మీ అన్నదమ్ములు యెవరో ఒకరు సర్దుతారు లెండి..." అంటూ అడ్డంపడిపోయింది. ఇంక చేసేదేం లేక ఊరుకున్నాను, డబ్బు సర్దలేకపోయాననే సిగ్గుతో

దాని పెళ్ళికి... నేను ప్రాణంకంటే కూడా యెక్కువగా చూసుకొనే నా చిన్నారి చె...ల్లి... పె...ళ్ళి...కి..."

"ఊరుకోండి నాన్నా...ఎప్పుడో అయిపోయిందానికి యిప్పుడు బాధపడతారు దేనికి," అన్నాడు ప్రసాద్ డగ్గుత్తికతో.

"అంతేలే...కాని, నా కొడుకువైనా నువ్వు నాకంటే యెంతో నయం. వచ్చావు; చెల్లెలి పెళ్ళికి నడుం కట్టావు బాధ్యత వహించావు అసలు అభినందించవలసింది నిన్ను కాదులే, దాన్ని.. శారదని ఆడబడుచు పెళ్ళికి అవసరం అనేసరికి తనమీది ఆభరణాలుకూడా అమ్మెయ్యడానికి వప్పుకుంది...ఎంత ఉన్నతురాలురా...నిజానికి కోటి రూపాయలు పెడితేమాత్రం అటువంటికోడలు దొరుకుతుందంటారా! ఆడది కాదంటే నువ్వుమాత్రం ఏం చెయ్యగలవు? అందుకే. .అందుకే. ..నువ్వు నాకంటే అదృష్టవంతుడివిరా. మీ ఇద్దరూ మా యిద్దరికంటే మీ బాధ్యత చక్కగా నిర్వహించారు. మేం యేమిటి; చెల్లెలి పెళ్ళికి వెళ్ళకుండా యింట్లో దొంగల్లా దాగుకొన్నవాళ్ళం. ఎలాగేనే, ఇప్పటి కుర్రాళ్ళు ... ఇప్పటి కుర్రాళ్ళు..." అంటూంటే గురునాథం గొంతు బొంగురుపోయి. కళ్లోంచి ఆనందాశ్రువులు రాలాయి. ప్రసాద్ తలమీద ఆశీర్వదిస్తూన్న అభినందల జల్లుంది.